

అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై ..

సమగ్ర విచారణ జరిపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా తెచ్చిన జీవో నెంబర్ 596 భూ చట్ట సవరణ పేదల భూములను పెద్దలు కబ్జా చేసేందుకు తోడ్పడిందని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసారు. భూ చట్ట సవరణ ప్రకారం 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు శాశ్వత భూ హక్కు కల్పిస్తామని నాడు వైసిపి నేతలు చెప్పారన్నారు. అసైన్డ్ భూములను సాగు చేసుకోవాల్సిన దళిత, గిరిజనులను భూముల నుంచి తరిమేసేందుకు ఈ చట్ట సవరణ రాజకీయ నాయకులకు ఉపయోగపడిందని విమర్శించారు. అనంతపురం జిల్లాలో 2.23 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల్ని నిరుపేదలైన దళిత గిరిజన బలహీన వర్గాల వారు మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. కానీ పేదల ఈ భూములను గతం నుంచి అక్రమంగా అనేక రూపాల్లో పెత్తందార్లు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఈ అక్రమాలను చట్టబద్ధం చేసుకునేందుకు గత సంవత్సరం చివర్లో వైసీపీ ప్రభుత్వం జీవో తెచ్చిందన్నారు. ఈ జీవోను ఉపసంహరించాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అప్పట్లోనే ఆందోళనలు చేసామని గుర్తు చేశారు. భూ చట్ట సవరణను ఉపయోగించుకుని జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో సుమారు 24 వేల ఎకరాల అసైన్డ్ భూములను నాటి అధికార పార్టీ నాయకులు, గ్రామ పెత్తందార్లు తమ పేర్ల మీదకు మార్చుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారి పేర్లు బహిరంగంగా ప్రకటించాలని, వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అన్యాక్రాంతం అయిన భూములు తిరిగి పేదలకు అప్పగించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తొలిపర్యటనలో హామీలేమిస్తారో..!

- నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటన
- పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా సత్యసాయి జిల్లాకు విచ్చేయనున్నారు. గురువారం మధ్యాహ్నం మడకశిర మండలం గుండుమలలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలోనూ పాల్గొంటారు. బహిరంగ సభలేవీ లేకుండానే మొదటి పర్యటన ముగియనుంది. తొలిసారిగా ఇక్కడికి విచ్చేస్తున్న ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా సమస్యలపై ఎటువంటి హామీలివ్వనున్నారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల సమయంలో జరిపిన పర్యటనలో అభివృద్ధి అంశాలను ఆయన లేవనెత్తారు. ఈ అంశాలపై తొలి పర్యటనలో ఏమైనా ప్రకటనలు చేస్తారా అని ఉమ్మడి జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా సాగునీటి రంగం గడిచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామన్న హామీ ప్రకటనలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి ఇప్పుడు పర్యటిస్తున్న మడకశిరకు హంద్రీనీవా నీళ్లు ఇవ్వాల్సి ఉంది. ఈ పనులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. ఈ పర్యటన సందర్భంగా హంద్రీనీవా నీళ్లను మడకశిరకు అందించే అంశంపై ఏ రకంగా స్పందిస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఇక మడకశిర ప్రాంతంలోనే పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసమని రాళ్ల అనంతపురం వద్ద భూమి సేకరణ చేశారు. ఇప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పన జరగలేదు. ఇక్కడికి కొత్త పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూసిన దాఖలాలూ లేవు. దీంతో మడకశిర ప్రాంతంలోని నిరుద్యోగ యువత, సామాన్యులు కూడా ఉపాధి కోసం కర్నాటక ప్రాంతానికి నిత్యం వలసలు వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన ఈ ప్రాంతంలో లెదర్ పార్కును ఏర్పాటు చేస్తామన్న హామీ కూడా దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉంది. ఇక తాగునీటికి ఇబ్బందులు నెలకొన్నాయి. పనులు కొన్ని మంజూరైన గడిచిన ఐదేళ్లలో పూర్తి స్థాయిలో చేపట్టలేదు. కర్నాటక సరిహద్దుల్లో ఉన్న మడకశిర ప్రాంతం ఎంతో వెనుకబడి ఉంది. ఈ ప్రాంతాభివృద్ధి కొత్త ప్రాజెక్టులేమైనా ప్రకటిస్తారా లేదా అని ఈ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా

గురువారం ఉదయం నంద్యాల జిల్లాలో పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 12.20 గంటలకు హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మడకశిరకు మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుకుంటారు. పాలిటెక్నికల్ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన తరువాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గుండుమలకు చేరుకుంటారు. గుండుమలలో వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడే గ్రామస్తులతో మాట్లాడుతారు. అనంతరం కరియమ్మ దేవస్థానం సందర్శిస్తారు. అనంతరం తిరుగు ప్రయాణమై సాయంత్రం 4.30 గంటలకు హెలిక్యాప్టర్‌లో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరానికి తిరుగు ప్రయాణమై వెళ్తారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి కేశవ్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, కలెక్టర్ చేతన్



హంగూ.. ఆర్భాటం లేకుండా ముఖాముఖి..

మడకశిర : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మడకశిర పర్యటను హంగూ..ఆర్భాటం లేకుండా జరగనుందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. బుధవారం నాడు వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఎలాంటి బహిరంగ సభా లేదన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎల్ఈడీ టీవీల ద్వారా కార్యక్రమాన్ని వీక్షించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా అధికారులు ఎక్కడా పరదాలు కట్టరాదన్నారు. ప్రజా వేదిక ద్వారా సామాన్య ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. గుండుమల పంచాయతీ ప్రజలు మాత్రమే ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమం ప్రజా వేదికపై మాట్లాడే విధంగా ఏర్పాట్లను అధికారులు చేశారన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

మంత్రి పయ్యావుల కేశవ్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

హంద్రీనీవా కెనాల్ కింద జిల్లాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహంలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు, నీటి కేటాయింపులు, పెండింగ్ పనులు, సమస్యలపై హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు ఈ ఏడాది శ్రీశైలం జలాశయం నుంచి జిల్లాకు 40 టిఎంసిల నీటిని కేటాయించారన్నారు. నీటిని తీసుకురావడం ఇప్పటికే ఆలస్యం కాగా, త్వరగా జిల్లాకు నీటిని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏవైనా సమస్యలున్నా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ప్రిలిమినరి స్టేటస్, పెండింగ్ పనుల స్టేటస్, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హంద్రీ నీవా సిఈ నాగరాజ, ఎస్ఈ దేశే నాయక్, ఈఈలు, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఉద్యోగ విరమణ పొందాక ఆరోగ్యంపై అశ్రద్ధ చూపకుండా శేష జీవితాన్ని మంచి ఆరోగ్యంతో సుఖంగా గడపాలని ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఆకాంక్షించారు. జిల్లాలో పని చేస్తున్న ఎస్ఐ నాగరాజు ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐ దంపతులకు ఎస్పీ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నాగరాజు విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా ముగించడం అభినందనీయం అన్నారు. పోలీసుశాఖలో చిన్న ఉద్యోగంతో జీవితం ప్రారంభించి ఎస్ఐ ఉద్యోగం వరకు ఎదగడం హర్షణీయమన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఏవైనా సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే జాప్యం లేకుండా పరిష్కారానికి కషి చేస్తామన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ దంపతులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐ ఇందిర, ఆర్ఐ మధు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన తెస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ప్రజా సమస్యలపై వినూత్న రీతిలో స్పందిస్తున్నారు. ప్రతిరోజు తన వద్దకు వచ్చి ప్రజల సమస్యలు చెబుతున్న నేపథ్యంలో ఆయన నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పలు కాలనీలకు ఆయన స్వయంగా సచివాలయాలు తనిఖీలు చేపడుతున్నారు. సచివాలయం వేదికగా ఫిర్యాదులు కూడా స్వీకరిస్తున్నారు. తాజాగా బుధవారం రాజీవ్ కాలనీ పంచాయతీలో ఆయన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు స్వీకరించారు. డ్రెయినేజీ, తాగునీరు, చెత్త వంటి సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం

అనంతపురం నగరంలో లక్ష మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గ్రీన్ ఆర్మీ కార్యక్రమంలో భాగంగా ఆయన అనంతపురంలోని నీరు ప్రగతి పార్క్ లో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రీన్ ఆర్మీ నిర్వాహకుడు అనిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మున్సిపల్ ఆర్డీ, ఇన్చార్జి కమిషనర్ పివివిఎస్.మూర్తి పార్కులో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం నగర వాసులకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రాజారావు, టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, టిడిపి జిల్లా నాయకుడు గోల సుధాకర్ నాయుడు, పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పేకాటపై ఆరోపణలు అవాస్తవం

అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా అనంతపూర్ క్లబ్ అభివద్ధికి కషి చేస్తానని చెప్పానే తప్పా, పేకాట నిర్వహణకు సహకరిస్తానని కాదని తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే దగ్గబాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేకాట శిబిరాలు నిర్వహించి ధనం సంపాదించాలనే అవసరం తనకు పట్టలేదని, తనపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్న వారిపై మండిపడ్డారు. క్లబ్‌లో సభ్యుల అభ్యర్థన మేరకు వ్యాయామ పరికరాలు.. సాంస్కతిక కార్యక్రమాల నిర్వహణకు పరికరాలు తదితర వాటికి కృషి చేస్తానని తాను చెప్పానన్నారు. కొంతమంది అనవసరంగా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు.



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : యుటిఎఫ్



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి పరిపాలనాధికారి ఆంజనేయులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ జీవో నెంబర్ 117 రద్దుచేసి .జీవో ఎంఎస్ నెంబర్ 53 తేదీ 12-10-2020 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. హైస్కూల్స్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. హై స్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మినిమం టైం స్కేలు ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేయాలన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో పిజిటి పోస్టులకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలన్నారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగేంద్ర, వివిధ మండలాల నాయకులు పవన్ కుమార్, మహమ్మద్ గౌస్, గంగాధర్ పాల్గొన్నారు.

టిడిపితో సొంతింటి కల సాకారం

వెంకటశివుడు యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం అవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తెలియజేశారు. గురువారం నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలందరికీ గృహాలు అనే నినాదంతో ప్రజలముందుకు వచ్చారన్నారు. 2014లో ప్రతీ పేదవాడికి ఇళ్లు కట్టించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీఎంఏవై పథకం కింద కేంద్ర వాటా రూ.1.80 లక్షలతో పాటు రాష్ట్ర వాటాగా గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.1 లక్ష సాయం అందించనున్నారన్నారు. ఈ సాయం తద్వారా రాష్ట్రంలో 12 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరేలా చేసారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక పేదల సొంతింటి కలపై నీలినీడలు కమ్ముకున్నాయన్నారు. ప్రస్తుతం ఇళ్ల స్థలాలు లేని వారికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు అందజేయనున్నట్లు తెలిపారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సాయం చేయనుందని తెలిపారు. పేద మధ్య తరగతి వారి కోసం రూ.4 లక్షలు ఇంటి నిర్మాణానికి అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పేదలకు వరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న వారికి పీఎంఏవై 2.0 పథకం వర్తించేలా కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించే దిశగా చంద్రబాబు మంతనాలు చేస్తున్నారని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సంపన్నులకు మేలు.. సామాన్యులకు నష్టం - రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం కలిగించేలా ఉందని పలు వురు వక్తలు తెలిపారు. సందర్భం వేదిక ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో సోమర రాహుల్ అధ్యక్షతన కేంద్ర బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నాం అంటూనే కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధించారన్నారు. రాజధాని నిర్మాణానికి ఇస్తున్న రూ. 15 వేల కోట్లు రుణమా, గ్రాంట్‌గా ఇస్తున్నారా స్పష్టత లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారే తప్ప నిర్దిష్ట నిధుల కేటాయింపు లపై ప్రస్తావన లేదన్నారు. గోదావరి ముంపు గ్రామాల ప్రజల పరిస్థితిని ప్రత్యక్షంగా చూస్తుంటే కేంద్ర సాయం ఎలాంటిదో అర్థమవుతుందన్నారు. గిరిజన, సెంట్రల్, పెట్రోల్ యూనివర్సి టీల ఏర్పాటుకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. రైతాంగం, ఉపాధి హామీ కేటాయిం పుల్లోనూ కోతలు విధించారన్నారు. కౌలు రైతుల సహకారంపై ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. కరువుకు నిలమైన అనంతపురం జిల్లా వంటి రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి అంతంత మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేని దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. పన్ను మినహాయింపు విధానంలో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. పారిశ్రామిక వాడల అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప ఓర్వకల్లు, కొప్పర్తి వంటి పారిశ్రామికవాడలకు నీటి కేటాయింపులు లేకపోవడం శోచనీయం అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపుల్లో స్పష్టత కొరవడిందన్నారు. సంపన్నులకు ఉపయోగపడేలా ఉందన్నారు. వీటిన్నిటినీ పరిశీలిస్తే కేంద్రం ఎపిని మరోసారి దగా చేయడానికి పూనుకున్నట్లు ఉందన్నారు. ఇకనైనా రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జాగ్రత్త వహించి రాష్ట్రానికి విరివిగా నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ వీరభద్రయ్య, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, డాక్టర్ ప్రసూన, పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక నాయకులు ఏజీ రాజమోహన్, శ్రీనివాసరావు, ఎస్ఎం.బాషా, అబ్దుల్ రజాక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగయ్య, సిపిఎం నగర రెండో కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, ప్రజాశక్తి సాహితి సంస్థ మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇన్‌ఛార్జి మురళి, రవిచంద్ర, ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యచంద్ర, సతీష్, జెవివి నాయకులు భాస్కర్, రామిరెడ్డి, గాంగేనాయక్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి : అమిలినేని

ప్రజాశక్తి-కుందుర్పి

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలియజేశారు. కుందుర్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేకల క్రిష్టప్ప బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తి ఉన్నతమైనదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన క్రిష్టప్ప ఎందరో విద్యార్థులను తీర్చి దిద్ది వారి భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఆయన శేషజీవితం కుటుంబ సభ్యులతో సాఫీగా గడవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన క్రిష్టప్పను సన్మానించారు. కుందుర్పి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడటానికి తగిన ఏర్పాట్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, స్కూల్ కమిటీ ఛైర్మన్ లక్ష్మణమూర్తి, ఎంఇఒలు ఓబుళపతి, తిప్పేస్వామి, సీనియర్ నాయకులు మోరెపల్లి మల్లికార్జున, ఎంపీటీసీ గంగమ్మ హనుమంతరాయుడు, టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఇటీవల పలు ప్రమాదాల్లో గాయపడిన, మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కుందుర్పిలో ప్రమాదవశాత్తు విద్యార్థి నీటిలో మునిగిపోతుండగా కాపాడ్డానికి వెళ్లిన మరో యువకుడు సైతం మతి చెందాడు. ఈ కుటుంబాలను పరామర్శించారు. సజ్జల నాగేంద్ర కుమారుడు విష్ణు, రామాచారి కుమారుడు నవీనలకు ఆర్థిక సహాయం అందించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కామ్రేడ్ లక్ష్మణమూర్తి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పద్మావతి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- అనంతపురం అర్బన్

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఎం.పద్మావతి సేవలు అభినందనీయమని జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. పద్మావతి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం నాడు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొని మాట్లాడారు. పద్మావతి జిల్లా పంచాయతీ రాజ్ శాఖలో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. అనంతరం పద్మావతిని శాలువా, పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఇన్‌ఛార్జి సిఇఒ ప్రభాకర్ రావు, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి కె.లలితా బాయి, కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల చట్టాలపై అవగాహన అవసరం : ఎడిఎ

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతు చట్టాలపై భూమి లేని కౌలు రైతులు అవగాహన పెంచుకుని, ప్రతి ఒక్కరూ కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలని అనంతపురం ఎడిఎ రవి తెలియజేశారు. గురువారం రాప్తాడు మండలం మరూరు గ్రామ రైతు సేవ కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఎం.చర్లపల్లి, మారూరు, గొల్లపల్లి రైతు సేవ కేంద్రాల సిబ్బంది, రైతులు ఇందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా కౌలు రైతుల చట్టాలపై ఎడిఎ రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బిఆర్.శేఖర్ రెడ్డి, వెంచర్లపల్లి ఎంపిఒ గంగరాజు, మరూరు విహెచ్ఎ హర్షవర్ధన్, గొల్లపల్లి విఎ గౌస్‌బాషా పాల్గొన్నారు. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు పూలకుంట ఆర్ఎస్‌కె పరిధిలోని గ్రామాల్లోనూ కౌలు రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జె.శశికళ పాల్గొని మాట్లాడారు. కౌలు గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన సహాయకులు భువనేశ్వరి, కవిత, ఎంపిఇఒ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతులను కించపరిస్తే సహించం

సీనియారిటీ మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయండి : ఎమ్మెల్యే సునీత


విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-ఆత్మకూరు

కార్యాలయాలకు వచ్చే రైతులను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. ఎమ్మెల్యే బుధవారం వెంకటాపురం లోని తన క్యాంపు కార్యాలయంలో చెన్నేకొత్త పల్లి, రామగిరి, కనగానపల్లి మండల విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించగా ఎడిఎతో పాటు ఎఇలు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై రైతుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా స్పందించకపోడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ ప్రమాదాలతో చాలామంది రైతులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డబ్బులు చెల్లించి ఏళ్ల గడుస్తున్నా ఇంతవరకూ ఎందుకు మంజూరు చేయలేదని ఆరా తీశారు. వైసిపి నాయకులకు అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఎలా వస్తున్నాయని నిలదీశారు. రైతుల విషయంలో రాజకీయాలు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్య ఎక్కడ ఉన్నా వెంటనే స్పందించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో సీనియారిటీ ప్రాతిపదికన వెంటనే మంజూరు చేయాలన్నారు. కొరత ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేసి వెంటనే తీసుకొస్తామని తెలిపారు. ఇక నుంచి రైతుల వైపు నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా పని చేయాలని సూచించారు.

డెంగీ నివారణకు సమిష్టిగా కృషి చేద్దాం


డెంగీపై అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-వజ్రకరూరు

డెంగీ వ్యాధి నివారణకు ప్రజలతో కలిసి వైద్య సిబ్బంది కలిసికట్టుగా పని చేద్దామని వైద్యాధికారి అరుణకుమారి సూచించారు. మండలంలోని పాల్తూరులో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. పిహెచ్‌సిలో డెంగీ వ్యతిరేక ముగింపు మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే డెంగీ నివారణ సాధ్యమన్నారు. ప్రజల భాగస్వామ్యంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, లాంటి సీజనల్ వ్యాధులను పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు అన్నారు. దోమల నివారణకు త్వరలో మురికి కాలువల్లో గంబూషియా చేప పిల్లలను వదులుతామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివశంకర్ నాయక్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, ఎంపిహెచ్ఇఒ త్యాగరాజు, హెల్త్ సూపర్వైజర్ సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్ ఈశ్వర్ నాయక్, హెల్త్ అసిస్టెంట్లు వాసు, మధుర, ఫార్మాసిస్ట్ రామాంజనమ్మ, స్టాఫ్ నర్స్ కల్పన పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-నార్పల/పుట్లూరు

నార్పల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సిడిపిఒ భారతి తెలిపారు. నార్పలలో బుధవారం సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని నార్పల, పుట్లూరు, ఎల్లనూరు మండల కేంద్రాలతో పాటు 3 మండలాల్లోని 164 అంగన్వాడీ కేంద్రాల్లో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఆసుపత్రులు, ఇంటింటినీ సందర్శించి బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వడం, ఆ తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం, రెండేళ్ల వరకూ తల్లిపాలు కొనసాగించాలని వివరిస్తామన్నారు. ముర్రుపాలు, తల్లిపాల వల్ల తల్లి, బిడ్డకు కలిగే ప్రయోజనాలు, పోత పాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే పరిశుభ్రత, పోషకాహారం, ఆసుపత్రిలో ప్రసవం, తదితర అంశాలపై వివరిస్తామన్నారు.

ఎస్‌బిఐ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

ఎస్సీలకు పింఛను, ఉపాధి హామీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్న సలకం చెరువు స్టేట్ బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న డిమాండ్ చేశారు. భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని సలకం చెరువు గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ బందెల నాగయ్య, గుండె సంబంధిత రోగి బందెల ముత్యాలమ్మ, ఒంటరి మహిళ బందెల లాల్‌మునెమ్మ, బందెల పెద్దక్కకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఏప్రిల్, మే పింఛను డబ్బులు ఇవ్వకుండా ఎస్‌బిఐ మేనేజర్ ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనికి తోడు వారిని హేళనగా చూస్తూ కులం పేరుతో దుర్భాషలాడారని మండిపడ్డారు. ఈ నలుగురు బ్యాంకులో ఉన్న అప్పు త్వరలోనే చెల్లిస్తామని చెబుతున్నా వినకుండా వారి పింఛను, ఉపాధి హామీ కూలి బిల్లులను హోల్డ్‌లో పెట్టాడన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వారి వారి సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారికి పింఛను, ఉపాధి కూలి డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామ కృష్ణ, పెద్ద కిష్ట, కుళ్లాయప్ప, నవీన్, నల్లక్క తదితరులు పాల్గొన్నారు.

విద్యా పథకాల పేర్ల మార్పు హర్షణీయం

ప్రజాశక్తి-శింగనమల

ఎపి రాష్ట్ర విద్యాశాఖలో భావితరాలకు స్ఫూర్తినందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యా వేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం అభినందనీయమని రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ లో విద్యా కానుక పథకాన్ని సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు, మధ్యాహ్న భోజన పథకానికి అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు, డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించాలని నిర్ణయం తీసుకున్న సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో అన్ని పథకాలకు జగన్ తన పేరే పెట్టుకున్నారు, అలాంటి సంప్రదాయా లకు స్వస్తి పలికి విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాల అమలు శుభ పరిణామం అన్నారు. ప్రభుత్వం నిర్ణయం యువతలో నూతన ఉత్తేజం కలిగిస్తుందని మాసూల చంద్రమోహన్ తెలిపారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీల తొలగింపు దుర్మార్గం

సిఐటియు నాయకురాలు నాగమణి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న ఏజెంట్లను ఎంఇఒలు మల్లికార్జున, ఈరన్న అకారణంగా ఉన్నఫళంగా తొలగిస్తున్నారని, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా నాయకురాలు నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, డిఇఒల నుంచి ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుండా ఎంఇఒలే కుట్ర పన్ని కొందరు పేదల పొట్ట కొట్టి వారికి అనుకూలమైన వారికి ఏజెన్సీలు కట్టబెడుతున్నారని తెలిపారు. చట్టపరంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జీవోలు విడుదల చేయకపోయినా ఎంఇఒలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇలాంటి దుర్మార్గ చర్యలకు పాల్పడుతున్న ఎంఇఒలపై జిల్లా కలెక్టర్, డిఇఒ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

కార్డుదారులకు పారదర్శకంగా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని, రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని జిల్లా సివిల్ సప్లైస్ అధికారిణి శోభారాణి తెలిపారు. ఉరవకొండ పట్టణంలో ఉన్న సివిల్ సప్లైస్ స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1645 రేషన్ దుకాణాలు ఉన్నాయని, వీటి ద్వారా ప్రజలకు బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. రాగులు, జొన్నలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతినెలా సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌తో పాటు రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తామని, అక్రమాలు జరిగినట్లు తెలిస్తే చర్యలు తప్పవన్నారు. వివాదాస్పద రేషన్ దుకాణాలకు సంబంధించిన వాటిపై విఆర్వోలు బాధ్యత తీసుకొని ప్రతి లబ్ధిదారునికి సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, విఆర్వోలు ఉన్నారు.

మండల అభివృద్ధికి సమిష్టిగా పనిచేద్దాం



మండల సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండల అభివృద్ధికి సమిష్టిగా పని చేద్దామని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపి డిఒ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు అధికారులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులు మాట్లాడుతూ ఇకపై రాజకీయాల జోలికి పోకుండా ప్రజల సమస్య పరిష్కారంపై దృష్టి పెడదామని పిలుపునిచ్చారు. అధికారులు మాట్లాడుతూ ఇంతవరకూ 46 మంది కౌలు రైతులకు మంజూరు పత్రాలు ఇచ్చామన్నారు. జూన్‌లో 6వేల హెక్టార్లలో పంటలు సాగయ్యా యని, మిగిలిన 7వేల హెక్టార్లలో పంటలు వేయలేదని ప్రత్యామ్నాయ పంటల కింద ఉలవలు, పెసలు, అలసందులు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మంత్రి కేశవ్ ఆదేశాలతో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేశారని టిడిపి నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, రాధాకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వంలో 'ఆడుదాం ఆంధ్ర' కింద సచివాలయాలకు ఇచ్చిన రూ. 10వేలు, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లు ఏమైయ్యాయని అధికారులని ప్రశ్నించారు. ఆర్అండ్‌బి ఎఇఒ కావ్య మాట్లాడుతూ బూదిగుమ్మ సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, అది పూర్తయితే అనంతపురం-రాయదుర్గం బెలుగుప్ప మీదగా సుమారు 20 కిలోమీటర్లు దూరం తగ్గుతుందన్నారు. మురికినీటి కాలువల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని సర్పంచి రామ్మోహన్ కోరారు. బెళుగుప్పలో బాలికల వసతి గృహం మంజూరుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. బెళుగుప్ప, ఎర్రగుడి గ్రామాల్లో నిర్మించిన ఇళ్లు నాసిరకంగా ఉన్నాయని, అధికారులు తనిఖీ చేయాలని నాయకులు కోరారు. ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని కూల్చివేయాలని చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్బరాజు, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్ పీరా, వైస్ ఎంపీపీ పుష్పావతి, ఏవో పృథ్వీసాగర్, ఎంఈఓ మల్లారెడ్డి, డాక్టర్ రిషికేష్, ఉద్యానవన శాఖ అధికారి కృష్ణతేజ పిఆర్, హౌసింగ్ ఎఇలు శివారెడ్డి, సుధాకర్, ఈఓఆర్‌డీ మాధవరెడ్డి, ఏవో దామోదర్, టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, సర్పంచులు, ఎంపిటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కెవికె స్వర్ణోత్సవ వేడుకలు



కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పడి 50 ఏళ్లు పూర్తి కావడంతో బుధవారం స్థానిక కెవికెలో ప్రిన్సిపల్ రాధాకుమారి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, రైతులు స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 1974 మార్చి 21వ తేదీ తమిళనాడులో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారని ప్రిన్సిపల్ గుర్తు చేశారు. దేశంలో 731వ కృషి విజ్ఞాన కేంద్రంగా కళ్యాణదుర్గం తీర్చిదిద్దబడిందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు వ్యవసా యం చేస్తున్నారన్నారు. దేశంలోనే కళ్యాణదుర్గం ప్రాంతంలో వాణిజ్య పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేయడంతో పాటు దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో పండించిన పంటలు దేశ, విదేశాలకు ఎగుమతి కావడం విశేషమన్నారు. శాస్త్రవేత్తల సలహాలు సూచనలతో పాటు రైతులు తమ వంతుగా పంటల సాగుకు విశేష కృషి చేయడం సంతోషకర మన్నారు. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం, భూసార పరీక్షలు, పంటల సాగుపై శిక్షణ, అద్దెకు వ్యవసాయ పనిముట్లు, మేలైన విత్తనాల పంపిణీ, తదితర అంశాల్లో కెవికె వ్యవసాయ రంగానికి దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు అనేక రకాలుగా సాయం చేస్తూ దేశంలోనే కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం మంచి గుర్తింపు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మల్లేశ్వరి, యుగంధర్, మల్లికార్జున, హరిణి, తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

క్రికెట్ పోటీలకు గుత్తి విద్యార్థులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో ఉన్న సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-16 జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుచున్న విక్టర్, మనోజ్ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించడంతో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరు త్వరలో నేపాల్‌లో జరిగే అండర్-16 జట్టు తరపున పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ సిస్టర్ రెజీనా, హెచ్ఎం సిస్టర్ హెలజరస్, పిఇటి రంగనాయకులు అభినందించారు.

హుండీల లెక్కింపు

నార్పల : మండలంలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను బుధవారం ఉదయం దేవాదాయ శాఖ అధికారులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో లెక్కించారు. హుండీల్లో రూ. 37,27,719 ఉన్నట్లు ఆలయ ఇఒ సాకేతపురం శోభ తెలిపారు.

బకాయి వేతనాల కోసం వినతి

వజ్రకరూరు : బకాయి వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ ఉరవకొండ ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయ పరిధిలో పని చేస్తున్న తాగునీటి సరఫరా కార్మికులు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ మంగళవారం సాయంత్రం ఉరవకొండ మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించేందుకు రాగా వారు కలెక్టర్‌ను కలిసి సమస్యలు మొరపెట్టుకున్నారు. ప్రతి నెలా 1వ తేదీ వేతనాలు మంజూరు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతి ఇచ్చిన వారిలో కార్మిక యూనియన్ నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, రాజశేఖర్, సాధిక్, శ్రీనివాసులు, ఉమాపతి, పెన్నయ్య ఉన్నారు.

నేడు పెన్నహోబిలంలో వేలంపాట

వజ్రకరూరు : ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆదాయ వనరులకు సంబంధించి గురువారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి సమక్షంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో కె.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు తలనీలాలు, 11 గంటలకు కొబ్బరి చిప్పలు, 12 గంటలకు బియ్యం బేడలకు సంబంధించి వేలం పాట నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

దుకాణదారులకు జరిమానా

గుత్తి : మున్సిపల్ అధికారులు బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎల్ఎన్ బెంగళూరు బేకరీ, టీ దుకాణం వద్ద చెత్త వేసి ఉండడంతో మున్సిపల్ కమిషనర్ రూ. 2వేలు జరిమానా విధించారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని, రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

పేదలకు 'నిత్యసురభి' చేయూత

అనంతపురం : నగరంలోని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మల మురళి రెండు పేద కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు హరనాథ్, కావేరి దంపతుల కుమారుడు దీపు పుట్టినరోజు సందర్భంగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో పల్లవి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పార్లమెంటులో బిజెపి ఎంపిల వ్యాఖ్యలు బాధాకరం

ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా॥పోతుల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

దేశానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన పార్లమెంట్‌లో బిజెపి ఎంపిలు అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమని రాజ్యాంగ పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు డా. పోతుల నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ తోటి పార్లమెంట్ సభ్యులు, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఈ విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. బిజెపి దేశ వ్యాప్తంగా బలహీన వర్గాలు, ముస్లింలు, గిరిజన, దళిత వర్గాలపై అరాచకాలు, అణచివేతకు పాల్పడుతూ అవమానాలకు గురిచేస్తుందన్నారు. ప్రధానంగా మతం పేరు తో విధ్వంసాలకు పాల్పడుతోందని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతుందన్నారు. మెజారిటీ ప్రజలకు కనీస వసతులు కల్పించకుండా విభజన రాజకీయాలు చేస్తుందన్నారు. కొన్ని కులాలను రాజకీయంగా అణచివేస్తున్నారన్నారు. ఆయా వర్గాలకు అండగా నిలుస్తున్న రాహుల్‌గాంధీని బిజెపి ఎంపిలు అవమానించడాన్ని ఆర్‌పిఎస్ ఖండిస్తుందన్నారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనురాగ్ ఠాకూర్‌కి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగే అర్హత లేదని, అతడిపై చర్యలు చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డాకు విజ్ఞప్తి చేశారు. అలాగే దేశంలో వెంటనే కులగణన చేపట్టాలని, చట్ట సభల్లో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ప్రకటిం చాలని డిమాండ్ చేశారు.

సోమనపల్లిలో పొలంబడి


పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని సోమనపల్లి గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో బుధ వారం ఇండ్ గ్యాప్ పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా క్యుఎంఎస్ టీం, పొలం బడి రైతులు, పొలం బడి ప్లాట్ ఎంపికలు, గ్రామసభ, బ్యాలెట్ బాక్స్, విత్తన శుద్ధి, తదితర కార్యక్రమాలు నిర్వహిం చారు. ముందుగా ఎడిఎ చెంగల్‌రాయుడు మాట్లాడుతూ ఇండ్ గ్యాప్ పొలం బడికి సంబంధించి క్యుఎంఎస్ టీం మెంబెర్స్‌ని రైతులకి పరిచయం చేశారు. అలాగే పొలం బడి సెషన్స్, ఏ ఏ సెషన్‌లో ఏ ఏ కార్యక్రమాలు నిర్వహించాలో రైతులకి వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి సాధించడమే పొలం బడి ముఖ్య ఉద్దేశం అన్నారు. అలాగే మట్టి పరీక్షలు చేయించుకొని వాటిని బట్టి ఎరువుల నిర్వహణ, సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. పొలం బడి ప్లాట్ నిర్వహణ, రక్షణ పంట, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. అనంతరం పొలం బడి రైతు పొలంలో బోధన్ పద్ధతుల ప్రదర్శనలో భాగంగా విత్తన శుద్ధి చేసి చూపించారు. వారి వెంట ఎఇఒలు, రైతులు ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు బుధవారం సిఐ వి.వెంకటరమణ, వ్యవసాయ అధికారులు జె.వాసుప్రకాష్, హెచ్ఎం.శివప్రసాద్, జి.ఓబిరెడ్డి బత్తలపల్లిలోని సంజయ్ ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్ చూపించకపోవడం, స్టాక్‌లో వ్యత్యాసాలు, స్టాక్ బోర్డు రిజిస్టర్‌ను సరిగా నిర్వహించకపోవడం గుర్తించారు. రూ. 69,390 విలువ చేసే 92.25 లీటర్ల పెస్టిసైడ్ స్టాక్‌కు స్థానిక వ్యవసాయాధికారి స్టాప్ సేల్ నోటీసులు ఇచ్చారు. నిషేధిత మందులు, గడ్డి మందులు, కాలం చెల్లిన పురుగు మందులు అమ్మినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

పిహెచ్‌సిలో మొక్కల సంరక్షణ చర్యలు

ప్రజాశక్తి-నార్పల

పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక పిహెచ్‌సి ఆవరణలో ఇటీవల అధికారులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది మొక్కలు నాటారు. వాటిని వైద్యులు, సిబ్బంది ఒకొక్కరు ఒక మొక్క దత్తత తీసుకొని సంరక్షణ బాధ్యత చేపట్టారు. అందులో భాగంగా బుధవారం ఆసుపత్రి ఆవరణలో నాటిన మొక్కల సంరక్షణ కోసం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రిప్పు సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, సాదియా, సిహెచ్ఒ బాలాజీ, సూపర్వైజర్ అక్కులప్ప, ల్యాబ్ టెక్నీషియన్ అరుణ, అక్షిత, అటెండర్ ఎర్రిస్వామి, అనసూయమ్మ, రామలింగ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

గుత్తి : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సర్వసాధారణమని వక్తలు తెలిపారు. పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు లింగన్న బుధవారం ఉద్యోగ విరమణ పొందగా పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు జి.వెంకటశివుడు యాదవ్, హెచ్ఎం సుభాన్, ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు లింగన్నను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని గ్రంథాలయ అధికారి వేణుగోపాల్‌రాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, గుత్తి శాఖ గ్రంథాలయ అధికారి, హెచ్. రామాంజనేయులు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. వేణుగోపాల్ రాయుడు దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎపి గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కమ్మన్న, సహాయ కార్యదర్శి హెచ్.శ్రీనివాసులు, గ్రంథాలయ అధికారులు పి.వెంకటేశ్వర్లు, జి.కృష్ణ, ఆదిలక్ష్మి, ఎం.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్లం ఉపాధ్యాయుడు ఆదినారాయణ ఉద్యోగ విరమణ పొందగా హెచ్ఎం సుధాకరబాబు ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పలు యూనియన్ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయు ఆదినారాయణను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

బెళుగుప్ప : స్థానిక జడ్పీ హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయుడు కొండారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందడంతో హెచ్ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒలు మల్లారెడ్డి, హెచ్ఎం బాలాజీ, వేణు గోపాల్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈశ్వరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ వైద్యుడికి సన్మానం

పామిడి : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ సి.ఎల్లప్ప ఉద్యోగోన్నతిపై గుత్తి ఆసుపత్రికి బదిలీ కాగా సిహెచ్‌సి వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు శివకార్తీక్‌రెడ్డి, కిరణ్మయి, మహేష్, కమలాకర్, రాఘవేంద్రరెడ్డి, ఆయుర్వేద వైద్యురాలు కృష్ణవేణి, ఫిజియోథెరపిస్ట్ పద్మలత, హెడ్ నర్సు శివకుమారి, నర్సులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి కేశవ్‌కు పూలమొక్క అందజేస్తున్న డిఎంహెచ్ఒ ఈబి దేవి

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

అనంతపురం : నగరంలోని ఆదిమూర్తినగర్, శ్రీనివాసనగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి దేవి తనిఖీ సందర్శించారు. ఓపి సేవలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్, అన్ని రకాల వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, కేంద్రం పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంత ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా మొక్కలు పెంచాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారి డా. జావీద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మంత్రిని కలిసిన డిఎంహెచ్ఒ


జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈబి దేవి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను గౌరవ పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిరుద్యోగులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

పెద్దపప్పూరు : నిరుద్యోగులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు బుధవారం మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దపప్పూరు ఆదినారా యణ, సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పసల కంబగిరి, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు చిన్న నరసింహులు విన్నవించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు మంజూరు చేయాలని కోరారు.

రాణిసత్రం వీధిలో చెత్త తొలగింపు

రాయదుర్గం : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ అధికారులు పట్టణంలోని రాణి సత్రం వెనుక వైపు వీధిలో చెత్త, చెదారం తొలగింపు చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులతో పాటు టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, 17, 18 వార్డుల ఇన్‌ఛార్జులు కొలిమి కరెన్న, వేణు, సామాజిక కార్యకర్త బిఎం నాదల్, తదితరులు దగ్గరుండి జెసిబి సాయంతో చెత్తను తొలగించి మట్టి చదును చేయించారు.


విద్యుత్ తీగలపై వేలాడుతున్న రమణారెడ్డి మృతదేహం

విద్యుదాఘాతంతో రైతు మృతి

నార్పల : మండలంలోని నల్లపు రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుదా ఘాతంతో రైతు రమణారెడ్డి(55) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రమణారెడ్డి తన పొలంలో ఫీజు వేయడానికి విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకొని ఎక్కాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా రావడం తో షాక్‌కు గురై తీగలపైనే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే నార్పల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దింపి ఆసుపత్రికి తరలించారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాడిమర్రి పోలీసులు తెలిపారు. కాగా సాయంత్రం అయినా రైతు మృతదేహాన్ని కిందకు దింపకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళన అనంతరం రాత్రి 6గంటలకు మృతదేహాన్ని విద్యుత్ అధికారులు కిందకు దించారు.